## క్లుప్తంగా

### గౌరమ్మకు ప్రత్యేక పూజలు



గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం శుద్ధ దశమిని పురస్కరించుకుని బుధవారం మెయిన్ బజార్‌లోని అమ్మవారిశాలలో ఆర్య వైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో గౌరమ్మను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీ మాత ప్రతిమను ఉంచి ప్రత్యేక పూజలు చేసి సామూహిక కుంకుమార్చన చేపట్టి మంగళ హారతులిచ్చారు. అధ్యక్షుడు భవనాశి వాసు, ప్రధాన కార్యదర్శి బైసాని రామశేషు, ఇందుమతి మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన కుమ్మరి గౌరమ్మకు, డిసెంబర్ 2న ఇసుక గౌరమ్మకు, 7న నిమజ్జనం చేపడతామని చెప్పారు. శోభారాణి, లక్ష్మి విజయకుమరి, రోజారమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే బాలాజీ కల్యాణ మండపంలో గౌరమ్మను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపించారు. కళెట్టి కృష్ణ మూర్తి, శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

### తొలగిన అంధకారం



వీధి బల్బు అమర్చుతున్న దృశ్యం

రుద్రవరం: ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి చొరవతో మండలంలోని శ్రీ రంగాపురంలో అంధకారం తొలగింది. సమస్య పరిష్కారం కావడంతో కొత్త కాలనీవాసులు, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరంగాపురంలో ఈ నెల 20వ తేదీన ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అంధకారంలో మగ్గుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే కొత్త లైట్లు అమర్చేందుకు చర్యలు తీసుకున్నారు. నంద్యాల నుంచి కొత్తగా 25 ఎల్‌ఈడీ లైట్లు కొనుగోలు చేసి తెప్పించి స్తంభాలకు బిగింపజేశారు. దీంతో గ్రామంలో చీకట్లు తొలగి విద్యుత్ కాంతులు విరజిమ్మాయి.

### కులగణనను బాధ్యతగా నిర్వహించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్

దొర్నిపాడు: కులగణనను గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా నిర్వర్తించాలని తహసీల్దార్ జయప్రసాద్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు సూచించారు. ఈనెల 27వ తేదీ నుంచి కులగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కులగణనకు ప్రత్యేక యాప్ రూపొందించారని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా వివరాలను యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఏవైనా సందేహాలుంటే అధికారులను సంప్రదించాలని సూచించారు.

చాగలమర్రి: ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కులగణనను పకడ్బందీగా చేపట్టాలని ట్రైనర్ స్వర్ణకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వలంటీర్లు, సచివాలయ స్బిందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఎఎస్ఓ దస్తగిరి పాల్గొన్నారు.

### ఘనంగా శిఖర ప్రతిష్ఠోత్సవ పూజలు



శిఖర కలశాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

శిరివెళ్ల: మహదేవపురంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, సీతారామ చంద్ర పార్వతీ పరమేశ్వర ఆలయ శిఖరాల ప్రతిష్ఠోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. బుధవారం శిఖ కలశాలకు అభిషేకాలు, గణపతి, రుద్ర, నవగ్రహ హోమాలు నిర్వహించారు. ఈ నెల 23వ తేదీన ఆలయ శిఖర కలశాల ప్రతిష్ఠ జరగనుంది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శేగు ఈశ్వరయ్య, ఉపాధ్యక్షుడు ఆత్మకూరి నాగభూషణం, కార్యదర్శి ఆకుతోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

### సేవలను సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోవెలకుంట్ల సహకార సంఘం చీఫ్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని బోడెమ్మనూరు, ఉయ్యాలవాడ సహకార పరపతి సంఘాల అధ్యక్షులు పోచా వెంకటరెడ్డి, బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన రైతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మేనేజర్ మాట్లాడారు. సమృద్ధి పథకంలో భాగంగా డిపాజిట్ దారులకు తమ బ్యాంకు ద్వారా అధిక వడ్డీలు ఇస్తున్నామన్నారు. వృద్ధులకు 8.20 శాతం, సాధారణ డిపాజిట్ దారులకు 7.70 శాతం వర్తిస్తుందన్నారు. ఈ అవకాశం డిసెంబర్ 13వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీసీఓబీ అధికారి సౌమ్య, సీఈఓలు రామచంద్రయ్య, మౌలాలి పాల్గొన్నారు.






డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం, డబ్ల్యూ కొత్తపల్లెలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఈఓపీఆర్డీ, సంక్షేమాభివృద్ధిని సూచించే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం, గొడిగనూరు గ్రామ సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ప్రదర్శిస్తున్న నాయకులు, అధికారులు

# ప్రతి ఇంటికీ ఆర్థిక భరోసా




సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు, ఆర్.జంబులదిన్నెలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, అధికారులు

ఆళ్లగడ్డ: నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ ఆర్థిక భరోసా ఇచ్చిందని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాతకందుకూరు గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం రూ.18 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ రామకృష్ణ, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ హేమలత, నాయకులు గంగుల రామిరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని జెడ్పీటీసీ కసాని పుణ్య లక్ష్మీదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ సూచించారు. బుధవారం మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామ సచివాలయంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును సర్పంచులు ప్రసాద్, ఉమా, ఎంపీటీసీ సభ్యులు బాలిరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఎంపీడీఓ పార్థసారధి మాట్లాడుతూ సచివాలయం పరిధిలో సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.18,75,78,125 ఖర్చు చేశామన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా 4,758 మంది లబ్ధిదారులకు రూ.13,91,74,296 వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. పరోక్షంగా 1531 మంది లబ్ధిదారులకు రూ.3,63,03,829 అందజేశామన్నారు. ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి విజయదీప్తి పాల్గొన్నారు.

దొర్నిపాడు: అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం డబ్ల్యూ కొత్తపల్లెలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం రూ.13.42 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి మధుశేఖర్ పాల్గొన్నారు.

నంద్యాల(సిటీ): ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్నామని 12వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్ ఆధ్వర్యంలో వార్డుకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్థానికులకు ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో సుమారుగా రూ. 15.71కోట్లు వివిధ పథకాల కింద అందజేసిందని చెప్పారు. మెప్మా సీఎంఎం విజయభాస్కరరెడ్డి, మున్సిపల్ ఏఈ హిమబిందు, వరమద్దిలేటి పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని గొడిగనూరు గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం పల్లెకు పోదాం కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీటీసీ పత్తి నారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వం నుంచి అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం సుమారు రూ.12 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. అనంతరం డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. నాయకులు పార్టీ జెండాను ఎగురువేశారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సర్పంచ్‌లు సంజీవరాయుడు, గోవిందయ్య, నాయకులు సూర్యనారాయణ, డీలర్ సంజీవరాయుడు, తులసి, పంచాయితీ కార్యదర్శి దస్తగిరి పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలోని లబ్ధిదారులకు రూ.15.46 కోట్ల లబ్ధి చేకూరిందని నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం గ్రామ సచివాలయం-1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డి, నాయకులు బాలవెంకట రెడ్డి, నాగేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

శిరివెళ్ల: ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల మద్దతు జగనన్నకే ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుండంపాడులో పల్లెకు పోదాం కార్యక్రమం జరిగింది. వారు ఇంటింటికీ తిరిగి పథకాల లబ్ధి, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి, దేవస్థానాల చైర్మన్లు రేవనూరు రామాంజనేయరెడ్డి, శివరామిరెడ్డి, సర్పంచులు జింకల నాగన్న, పెద్ది రమణయ్య, నాయకులు దండె ప్రతాపరెడ్డి, గాలి ప్రకాశం, రవికుమార్, వెంకటరెడ్డి, సొసైటీ డైరెక్టర్ రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్లు దస్తగిరిరెడ్డి, నాగ ఊశేని, శాంతమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం ద్వారా రూ.14.42 కోట్ల ప్రభుత్వం వెచ్చిందన్నారు.

అనంతరం డిస్‌ప్లే బోర్డు, బ్రోచర్ల ఆవిష్కరణ చేపట్టారు.



గుండంపాడులో పథకాలను ప్రజలకు వివరిస్తున్న అబ్దుల్ సలాం

## పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

గోస్పాడు: నిరుపేదల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యాల్లూరు మజరా గ్రామాలైన బీబీనగర్, శ్రీనివాసపురం గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన గడప గడపకు వెళ్లి ప్రజలకు లబ్ధిని వివరించే బ్రోచర్లను అందజేశారు. జగనన్న చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల్లో ఆయనకు లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు బురదజల్లే రాజకీయాలకు పాల్పడుతున్నాయని, వారి మోసపూరిత మాటలను నమ్మొద్దని ప్రజలను కోరారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శకుంతలమ్మ, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, యాల్లూరు సొసైటీ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, సర్పంచ్ గడ్డం రత్నమ్మ, ఉప సర్పంచ్ నాగేశ్వర రెడ్డి ,ఎంపీటీసీ లు భారతి, కళ్యాణి, నాయకులు ప్రసాద్, నాగేస్, వేణు, మురళీ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చినందుకే ప్రజల్లోకి వెళ్తున్నాం



బీరవోలులో సంక్షేమ లబ్ధిని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే గంగుల

రుద్రవరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చినందునే ప్రజల్లోకి వెళ్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బీరవోలు,ఎల్లావత్తుల గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు మండల స్థాయి అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేసిన పథకాల గురించి, పొందిన లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. నాలుగేళ్లలో ప్రతి ఇంటికి కనీసం మూడు నుంచి ఆరు పథకాలు వర్తింపేజేశారని, గతంలో ఇలా ఎన్నడూ అర్హులందరికీ పథకాలు అందజేసిన దాఖలాలు లేవన్నారు. ఇక వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు పింఛన్ కోసం ప్రతినెలా ఎదురు చూడాల్సి వచ్చేదని, వారు చెప్పిన చోటుకల్లా తిరిగి తెచ్చుకోవాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రతి నెలా ఒకటో తేదీనే తెల్లవారక ముందే ఇంటి తలుపుతట్టి మరీ పింఛన్ సొమ్ము చేతికందజేసేలా జగనన్న చర్యలు చేపట్టారని, టీడీపీ పాలన, జగనన్న పాలనను బేరిజు వేసుకోవాలని, ఎవరు ప్రజలకు మంచి చేశారో మీరు గ్రహించాలని, మరోసారి ఇబ్బందులు కొనితెచ్చుకోరాదనుకున్నా, సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కొన్ని కాలనీల్లో విద్యుత్ స్తంభాలు,అంతర్గత రోడ్లు వేయించాలని కోరగా వెంటనే వేయిస్తామని, అందుకు సంబంధించిన ప్రణాళికలు పంపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నంద్యాల విజయా డెయిరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, ఎంపీపీ బాలస్వామి,ఎంపీటీసీ కాశన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రసాదరెడ్డి,సర్పంచు ఏలిషా,కన్వీనర్ పుల్లారెడ్డి,నాయకులు శేషు,రాజ్‌కుమార్, దావీదు,వెంకటేష్,దేవగుడి జాకీర్,బైరి శంకర్,రమణారెడ్డి,లక్ష్మీరెడ్డి,క్రిష్ణమూర్తి, గోవిందు, కృష్ణారెడ్డి,మోహన్,కాంతారెడ్డి,మధు,ఏఈలు వెంకటరాముడు,ప్రమోద్,రాఘవేంద్రారెడ్డి,ఏపీఎం కల్పన,ఏపీఓ ప్రతాప్,ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ, పంచాయతీ కార్యదర్శి పాములేటి పాల్గొన్నారు.

## టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్రీనివాస నగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రూ.9.60 కోట్ల అంచనాతో నూతన టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా బుధవారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితం నిర్మించిన టీటీడీ కల్యాణ మండపం అనేక శుభకార్యాలకు, వివాహాలకు వేదికగా ఉండేదన్నారు. కాలక్రమేణ శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనం నిర్మించాలని గత టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి సహకారంతో 2022 నవంబరు 30న టీటీడీ నిధులు మంజూరు చేసిందన్నారు. అందరికీ అందుబాటులో అధునాతన సౌకర్యాలతో, సువిశాల ప్రాంగణంలో నిర్మిస్తున్నారన్నారు. మండపం నిర్మాణానికి అత్యంత విలువైన భూమిని విరాళంగా ఇచ్చిన ఎలుకూరి కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళా రెడ్డి, ఎలుకూరు సుగుణ కుమార్, కుమార స్వామి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, సిద్దం శివరాం, నెరవాటి సత్యనారాయణ, దేశం సుధాకర్ రెడ్డి, కల్లూరి రామలింగారెడ్డి, టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### అభివృద్ధి కనిపించడం లేదా?

నంద్యాల(సిటీ): పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి ప్రతిపక్ష నాయకుల కళ్లకు కనిపించడం లేదా అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని 5వ వార్డులో కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్‌తో కలిసి రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోజూ ఏదో ఒక ప్రాంతంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఆరు నెలలుల్లో సుమారు రూ.2.5 కోట్లతో పనులు చేపట్టామని చెప్పారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు సమద్, సాదిక్, మాజీ కౌన్సిలర్ చాంద్‌బీ, మహానందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ నాగభూషణం పాల్గొన్నారు.

### విరగబూసిన కంది..



దొర్నిపాడు శివారులో నీటితడులివ్వడంతో మొక్క నిండుగా పూతతో కంది పైరు

దొర్నిపాడు: కేసీ కాల్వకు నీటిని విడుదల చేయడంతో పంటలు కళకళలాడుతున్నాయి. ఎండిపోయే దశలో నీరందడంతో జీవం పోసుకున్నాయి. మండలంలో 182 హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. ప్రస్తుతం పూత దశలో ఉంది. నీటి తడులివ్వడంతో మొక్కలకు నిండుగా పూత పట్టింది. విరబూసిన పైరును చూసి రైతన్నలు సంబరపడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కంది క్వింటా ధర రూ.15వేలకు పైగా పలుకుతుండటంతో అలాగే కందిపప్పు కిలో రూ.200 వరకు ఉండటంతో కందుల ధర మరింత పెరిగే అవకాశముందని, ఇప్పటిలాగే పంట ఉంటే ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశముందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

### నేడు 'పల్లెకు పోదాం'

శిరివెళ్ల: ఈ నెల 23వ తేదీన మండలంలోని జీనేపల్లె సచివాలయంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. సంక్షేమ పథకాల సూచిక బోర్డు, బ్రోచర్ల ఆవిష్కరణ కార్యక్రమాలుంటాయని చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

### 24న మంగళ కైశిక ద్వాదశి

ఆళ్లగడ్డ: ఈనెల 24వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళ కైశిక ద్వాదశి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆదర్శనగర్‌లోని శ్రీరామాలయం, పొన్నాపుం, కల్లూరు మండలం పర్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం, కోడుమూరులోని వర్కూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో శ్రీరామలయంలో మంగళకైశిక ద్వాదశి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధార్మిక కార్యక్రమాలను అట్టడుగు వర్గాల దగ్గరకు తీసుకెళ్లేందుకు విస్తృతంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యుడు వీరాంజనేయరావు, శ్రీరామాలయ కమిటీ అధ్యక్షుడు బత్తుల శేషు పాములేటి, సంజీవరాయుడు, నాగభూషణం, బత్తుల పెద్దసుబరాయుడు, బాలవికాస్ జిల్లా కన్వీనర్ ఆవుల రామపుల్లయ్య, క్రిష్ణయ్య, గురువయ్య, మౌలాలి, పద్మావతి పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూములను కాపాడాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ కొలూరు వద్ద ప్రభుత్వ భూములు ఆక్రమించి వెంచర్లు వేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాగు, పోరంబోకు భూములను ప్రభుత్వ అనుమతి లేకుండా సొసైటీ పేరుతో వెంచర్లు వేసి అమ్ముకుంటున్న ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్సీ కాలనీలో 200 కుటుంబాలు ఈ వెంచర్ వల్ల వాగు నీటిలో మునిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### ఉపాధ్యాయుడిని విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): బనగానపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు మాధవ స్వామిపై ఉన్న అక్రమ సస్పెన్షన్‌ను తొలగించి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు జిల్లా ఉన్నతాధికారులను కోరారు. బుధవారం జిల్లా కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పుల్లయ్య, మునిస్వామి పాల్గొన్నారు.

## సురక్ష ద్వారా 2.50 లక్షల మందికి వైద్య సేవలు



గొట్లూరులో ఫ్యామిలీ ఫిజిషియన్‌లో మహిళతో మాట్లాడుతున్న వెంకటరమణ

చాగలమర్రి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నంద్యాల జిల్లాలో 415 జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక క్యాంపులు నిర్వహించి 2.50 లక్షల మందికి వైద్య సేవలు అందించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వెకంటరమణ తెలిపారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫార్మసీలో మందుల నిల్వలు, ల్యాబ్, ఓపీ రిజిష్టర్‌తో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన గొట్లూరు గ్రామంలో డాక్టర్ పి.అంజిలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంను తనిఖీ చేశారు. అలాగే ఈ ప్రత్యేక క్యాంపుల ద్వారా 4,500 మందికి ప్రత్యేక వైద్య సేవల నిమిత్తం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ గల ఆసుపత్రులకు రెఫర్ చేశామని చెప్పారు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది, మందుల కొరత లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేశామన్నారు. చాగలమర్రి సీహెచ్‌సీలో ఇద్దరు, ముత్యాలపాడు పీహెచ్‌సీలో ఒక డాక్టర్‌ను నియమించామన్నారు. వైద్యులు తస్లీం సుల్తానా, సూపర్‌వైజర్లు సీతారాములమ్మ, రామలింగారెడ్డి, సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మీ, ఏఎన్ఎం పద్మావతి, ఎంపీహెచ్ఏ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

చాగలమర్రి: జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని నవ్యశ్రీ ఎంపికైందని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.కోటయ్య బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 9వ తరగతి విద్యనభ్యసిస్తున్న నవ్యశ్రీ ఈ నెల 4,5,6 తేదీల్లో ఒంగోలులో స్కూల్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలికల విభాగంలో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించి ప్రతిభ చూపి జాతీయ జట్టుకు ఎంపికైందని చెప్పారు. వచ్చే ఏడాది జనవరిలో రాజస్థాన్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తుందన్నారు. విద్యార్థినిని ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

## గాయపడిన వీఆర్వోకు ఆర్థిక సాయం



ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాలటౌన్: ఆళ్లగడ్డలోని 8వ సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న ఆదిలక్ష్మి గత శుక్రవారం ఆళ్లగడ్డ మండలంలోని పేరాయపల్లె మెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వీఆర్ఓను బుధవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య, నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పరామర్శించారు. గాయపడిన వీఆర్ఓకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆస్పత్రి సిబ్బందికి కలెక్టర్ సూచించారు. అనంతరం రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ తరపున రూ.3 లక్షలు, జిల్లా కలెక్టర్ తరపున రూ. 2 లక్షల చెక్కును అందజేశారు.